పేదల ఇళ్లపై టీడీపీ ప్రతాపం

'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం గూడు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి గృహాలు నిర్మించి ఇవ్వాలనుకున్న బృహత్తర కార్యక్రమంపై టీడీపీ విషం చిమ్మింది. పేదల సొంతింటి కల సాకారం కాకుండా శత విధాలా ప్రయత్నించింది. ఆ పార్టీ నేతలు న్యాయస్థానాలకు వెళ్లి జగనన్న లేఅవుట్ల పనులు నిలిపివేసేలా స్టే తెచ్చారు. పొదలకూరు మండలంలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కృషితో మరోచోట లేఅవుట్ ఏర్పాటు చేసి పేదలకు ఇళ్ల స్థలాలు అందించారు. నుడా పరిధిలో చేర్చి అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇల్లు మంజూరు చేయించారు.

- జగనన్న లేఅవుట్లలో అవకతవకలంటూ విషప్రచారం
- న్యాయస్థానాలకు వెళ్లి నిలుపుదల
- పొదలకూరుకు సమీపంలో అతిపెద్ద లేఅవుట్
- 1,600 మంది లబ్ధిదారులకు ప్లాట్ల కేటాయింపు
- నుడా పరిధిలో చేర్చడంతో మండలానికి 5,100 ఇళ్ల మంజూరు


పొదలకూరు సమీపంలో ఏర్పాటైన జగనన్న లేఅవుట్

పొదలకూరు: మండలంలో ప్రభుత్వం పేదల ఇళ్ల కోసం సిద్ధం చేసిన జగనన్న కాలనీలపై ప్రతిపక్షాలు పనిగట్టుకుని విషప్రచారానికి దిగాయి. పొదలకూరు పట్టణానికి సమీపంలో ఉన్న అతిపెద్ద లేఅవుట్ వద్దకు తరచూ వెళ్లి అవకతవకలు జరిగాయంటూ ప్రతిపక్ష పార్టీ నేతలు నానాయాగీ చేస్తున్నారు. అంతేకాక కొందరు టీడీపీ నేతలు న్యాయస్థానాలకు వెళ్లి లేఅవుట్ల పనులను కూడా నిలుపుదల చేయించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఉన్న పొదలకూరు మండలం ఇటీవల వరకు నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్(నుడా) పరిధిలో లేకపోవడంతో పక్కాఇళ్లు మంజూరు కావడంలో కొంత జాప్యం జరిగింది. నియోజకవర్గంలోని టీపీ గూడూరు, ముత్తుకూరు, వెంకటాచలం, మనుబోలు మండలాలు ఇప్పటికే నుడా పరిధిలో ఉన్నాయి. అయితే 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోనే పెద్ద మండలమైన పొదలకూరులో 57 జగనన్న కాలనీల పేరుతో ప్రభుత్వ లేఅవుట్లను సుమారు రూ.25 కోట్లు ఖర్చు చేసి సిద్ధం చేశారు. ఈ మండలం నుడా పరిధిలో లేకపోవడం వల్ల ప్లాట్లు పొందిన లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం లేకుండాపోయింది. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని మండలాన్ని నుడా పరిధిలో చేర్చేలా చర్యలు తీసుకుని మొత్తం 5,100 పక్కా ఇళ్లను మంజూరు చేయించారు. ఫలితంగా జగనన్న కాలనీలో ప్లాటు ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ఇల్లు మంజూరైంది.

పక్కాఇళ్ల మంజూరు

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పట్టుబట్టి మండలాన్ని నుడాలో చేర్పించిన వెంటనే 5,100 ఇళ్లు నుడాలో, మరో 897 ఇళ్లు ప్రధానమంత్రి గృహయోజనలో మంజూరు చేయించారు. దీంతో మండలంలో పక్కా ఇల్లు కావాలంటున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లను మంజూరు చేసే అవకాశం కలిగింది. వ్యక్తిగతంగా ఇల్లు నిర్మించుకుంటాలని అభ్యర్థించే లబ్ధిదారులేకాక, శిథిలావస్థలో ఉన్న ఇళ్లకు సైతం కొత్త ఇంటిని నిర్మించుకునేలా పక్కా ఇళ్లను మంజూరు చేయిస్తామని మంత్రి ప్రకటించారు. ఒక్క పొదలకూరు పట్టణానికి చెందిన ఇళ్లు లేని పేదలకు 1,600 ప్లాట్లను అందజేసి ఇళ్లను మంజూరు చేయిస్తున్నారు. ఇందుకు సంబంధించి సచివాలయ వలంటీర్లు ఆధార్‌కార్డుల వెరిఫికేషన్ కూడా పూర్తి చేశారు. దీంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

న్యాయస్థానానికి వెళ్లిన టీడీపీ నేతలు

జగనన్న కాలనీల పేరుతో పొదలకూరు మండలంలో మొత్తం 57 లేఅవుట్లను సుమారు రూ.25 కోట్ల వ్యయంతో సిద్ధం చేశారు. ఇందులో ఇప్పటికీ 25 శాతం బిల్లులను ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు చేసిన వారికి చెల్లించలేదు. పొదలకూరు పట్టణంలో ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ముందుగా నెల్లూరు మార్గంలో చాటగొట్ల పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమిలో లేఅవుట్‌ను సిద్ధం చేసేందుకు పనులు ప్రారంభించి కొంతవరకు పనులు కూడా పూర్తి చేశారు. అయితే ఆ పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు కొందరు తమ గ్రామంలోని వారికి కాకుండా బయటి వ్యక్తులకు ఇక్కడ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు వీలులేదంటూ న్యాయస్థానానికి వెళ్లి స్టే తీసుకొచ్చారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పట్టణానికి సమీపంలో ఉన్న చిట్టెపల్లి కొండ సర్వేనంబర్ 707లో 40 ఎకరాల్లో లేఅవుట్‌ను ఏర్పాటు చేసి పేదలకు ఇంటి నివేశనా స్థలాలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. దానిపై కూడా కొందరు టీడీపీ నాయకులు న్యాయస్థానాలను ఆశ్రయించాలని ప్రయత్నించి విఫలమయ్యారు.

నా కల నెరవేరబోతోంది



ఇంటి నివేశనా స్థలం పొందడం, ఇల్లు నిర్మించుకోవడం కలగానే ఉండేది. ప్రభుత్వం ఇంటి ప్లాటుతోపాటు పక్కా ఇల్లు మంజూరు చేయడంతో నా కల నెరవేరబోతోంది. చాలా ఏళ్లుగా సొంతిల్లు లేక అవస్థలు పడ్డాం. ప్రస్తుతం ఇల్లు మంజూరు కావడంతో నిర్మించుకునేందుకు సన్నాహాలు చేస్తున్నాం.
– షేక్ కరిమున్నీసా, పొదలకూరు

ఇల్లు లేక ఇబ్బందులు పడ్డాం



చాలా ఏళ్లుగా ఇల్లు లేక ఇబ్బందులు పడ్డాం. పొదలకూరు పట్టణంలోని కాకాణి నగర్‌లో చిన్న ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నాం. జగనన్న కాలనీలో ఇంటి నివేశనా స్థలంతోపాటు ఇల్లు మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇల్లు నిర్మించుకుని అందులోకి వెళతాం.
– చలంచర్ల పెంచలమ్మ, పొదలకూరు

అవినీతి జరగలేదు

జగనన్న లేఅవుట్ల నిర్మాణంలో ఎక్కడా అవినీతి జరగలేదు. ముఖ్యంగా సుమారు రూ.కోటితో పొదలకూరు ప్రభుత్వ లేఅవుట్ నిర్మాణ పనులు జరిగాయి. ప్రతి పనిని డ్రోన్లతో పరిశీలించి బిల్లులు చేశాం.
– మధుసూదన్, ఉపాధి హామీ ఏపీఎం, పొదలకూరు

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



అర్హులైన ప్రతి ఒక్కరికీ పొదలకూరు సమీపంలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలు అందజేశాం. మొత్తం 1,600 ప్లాట్లు 9 అంకణాల వంతున సిద్ధం చేశాం. ఇటీవల మిగిలి ఉన్న ప్లాట్లను కూడా మంత్రి కాకాణి చేతుల మీదుగా 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో లబ్ధిదారులకు పంపిణీ చేశాం. అవసరమైతే అదనంగా ఇళ్ల స్థలాలను సిద్ధం చేసే అవకాశం ఉంది.
– ఐఎస్ ప్రసాద్, తహసీల్దార్, పొదలకూరు

టీడీపీకి అధికారం ఎండమావే..!


సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని తెలుసుకుంటున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: ఎన్ని కుయుక్తులు పన్నినా వచ్చే ఎన్నికల్లో టీడీపీకి అధికారం లభించడం ఎండమావేనని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని బద్దెవోలు గ్రామంలో మంత్రి కాకాణి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని పేదలందరికీ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అయితే, ఇందుకు విరుద్ధంగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన ఘనుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. చంద్రబాబును మళ్లీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్న చందంగా లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. జీఓ అనే అక్షరాలను పలకలేక జియో అని పలికిన లోకేష్ మంత్రిగా పనిచేయడం మన దౌర్భాగ్యమన్నారు. చంద్రబాబు ఏ కార్యక్రమం తలపెట్టినా అపశ్రుతులు చోటు చేసుకుంటున్నాయని, ప్రజలు, దేవుడి ఆశీస్సులు లేకపోవడం వల్లే ఇలా జరుగుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయా.. లేదా.. అని పరిశీలించడంతోపాటు ఇంకా ప్రజలకు ఏం కావాలో తెలుసుకునేందుకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు చిట్టమూరు అనితమ్మ, సర్పంచ్ ఉగ్గుమూడి శశిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏడెం మల్లికార్జునరెడ్డి, వల్లూరు హర్షవర్ధన్‌రెడ్డి, చిట్టమూరు అజయ్‌రెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మధురెడ్డి, కసిరెడ్డి ధనుంజయరెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, సుధీర్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, జయశేఖర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకటేశ్వరునికి వసంతోత్సవం


శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పొదలకూరు: పట్టణంలోని అయ్యప్పనగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం కల్యాణ వెంకటేశ్వరస్వామికి వసంతోత్సవం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి పుష్పాలు, ఆభరణాలతో విశేషంగా అలంకరించారు. సర్వాలంకార భూషితులైన స్వామి, అమ్మవార్లకు కనుల పండువగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి స్థానిక గేటు సెంటర్ వరకు ఊరేగింపు కొనసాగింది. భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవంలో పాల్గొని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

లాలా లజపతిరాయ్ చిరస్మరణీయుడు


లాలా లజపతిరాయ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కొడవలూరు: స్వాతంత్య్ర సమరయోధుడు లాలా లజపతిరాయ్ చిరస్మరణీయుడని, భారతీయుల గుండెల్లో ఆయనకు సుస్థిర స్థానం ఉందని హెచ్‌ఎం టి.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం లాలా లజపతిరాయ్ జయంతిని సందర్భంగా శనివారం మండలంలోని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాలలో ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ స్వాతంత్య్ర సంగ్రామంలో లాలా లజపతిరాయ్ బ్రిటిషు వారికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడారని గుర్తుచేశారు. ఆయన 'సైమన్ గో బ్యాక్' అంటూ ఇచ్చిన నినాదం భారతీయుల మనస్సుల్లో నిలిచిపోయిందన్నారు. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా ఆయన చేసిన ఆందోళన గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ ఎస్.రవిరోజా, ఉపాధ్యాయురాలు బి.శ్రీశైల, సహాయకురాలు జి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ చాలా అవసరం

- కృష్ణపట్నం సీఐ వేమారెడ్డి


మాట్లాడుతున్న సీఐ వేమారెడ్డి

ముత్తుకూరు: విద్యార్థినీ విద్యార్థులకు క్రమశిక్షణ చాలా అవసరమని కృష్ణపట్నం సీఐ వేమారెడ్డి అన్నారు. ముత్తుకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో శనివారం విద్యార్థినులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు ముఖ్యంగా 'గుడ్ టచ్–బ్యాడ్ టచ్' పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పరపురుషుల ప్రవర్తన పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితులకు దూరంగా ఉండాలంటూ ఉదాహరణల ద్వారా వివరించారు. చిన్నచిన్న కోరికలు తీర్చుకోవడానికి కళాశాల వదిలివెళ్లరాదని, చదువుపై ఎక్కువ శ్రద్ధ చూపాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుజాత, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

వెంకటాచలం: వరిసాగులో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని మండల వ్యవసాయశాఖాధికారి హరికరుణాకర్‌రెడ్డి సూచించారు. మండలంలోని తిక్కవరప్పాడు, గొట్లపాళెం గ్రామాల్లోని పంట పొలాల్లో సాగులో ఉన్న బీపీటీ 5204 రకం వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ వరి పంటకు అగ్గి తెగులు, మెడ విరుపు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. అనంతరం వ్యవసాయశాఖాధికారి మాట్లాడుతూ వరిసాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అగ్గి తెగులు, మెడవిరుపు నియంత్రణకు వినియోగించాల్సిన మందుల గురించి రైతులకు వివరించారు.

దిశ చట్టంతో బాలికల సంరక్షణ


మాట్లాడుతున్న ఎస్సై ఆనంద్‌భాస్కర్‌బాబు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన దిశ చట్టం బాలికల సంరక్షణకు దోహదం చేస్తుందని ఎస్సై ఆనంద్‌భాస్కర్‌బాబు అన్నారు. విడవలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దిశ చట్టం, యాప్‌లపై విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిశ చట్టం ద్వారా మహిళలతోపాటు బాలికలకు కూడా రక్షణ లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ను తప్పనిసరిగా తమ స్మార్ట్‌ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకుని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు రమ్య, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలు కోరుకున్న పథకాలే రాష్ట్రంలో అమలు


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: ప్రజలు కోరుకున్న సంక్షేమ పథకాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని యల్లాయపాళెంలో ఆయన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను ప్రజలకు అందజేసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసంకల్పయాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల ద్వారా పేదల అభ్యున్నతికి బాటలు వేశారని తెలిపారు. గత మూడున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో మండలానికి రూ.170 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు లబ్ధి చేకూరిందని తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధులు వారి నియోజకవర్గాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకం కావడం ఒక మహత్తర కార్యక్రమమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సంక్షేమ పథకాల అమలును చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షనేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజల మనస్సుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీర్తిప్రతిష్టలను చెరపలేరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, తహసీల్దార్, ఎంపీడీఓ రమాదేవి, సుబ్రహ్మణ్యం, ఎంపీపీ గాలి జ్యోతి, ఎంఈఓ వసంతకుమారి, ఏఓ లక్ష్మి, నాయకులు ఇసనాక సునీల్‌రెడ్డి, డి.సాయిరెడ్డి, తాటిపర్తి భాస్కర్, కె.వెంకటరమణారెడ్డి, మల్లికిషోర్‌రెడ్డి, మాబాషా, టి.ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


ఉపాధ్యాయుడు నాగభూషణం అందజేసిన బునియాద్ పుస్తకాలను చూపుతున్న విద్యార్థులు

కొడవలూరు: మండలంలోని గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఆ పాఠశాల హిందీ పండిట్ జి.నాగభూషణం బునియాద్(పునాది) పుస్తకాలను శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ పుస్తకాలను హిందీ పండిట్ నాగభూషణం సొంతంగా రచించారు. విద్యార్థులు హిందీ భాషను సులువుగా నేర్చుకొనేలా ఈ పుస్తకాన్ని రూపకల్పన చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గ్రంథాలయాలకు వీటిని ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు నాగభూషణం తెలిపారు. ఆ పాఠశాల హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ పాఠశాలలోని విద్యార్థులకు హిందీ పండిట్ రూపొందించిన బునియాద్ పుస్తకాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'గంటా'కు అవార్డు


నరసింహులును అభినందిస్తున్న దృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా నరసింహులు చేసిన సేవా కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఈ నెల 26వ తేదీన రాజమండ్రిలోని ఆనం రోటరీ క్లబ్‌లో ఈ అవార్డును అందజేసినట్లు తెలిపారు. శనివారం బుచ్చిరెడ్డిపాళెంలో పలువురు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ షర్మిలారెడ్డి, జయరాం, వెంకటరామిరెడ్డి, వాణీప్రదీప్ తదితరులు తెలిపారు.

బైక్‌ను ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్‌ను ఆటో ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు వద్ద శనివారం చోటుచేసుకుంది. నెల్లూరు నగరానికి చెందిన వెంకటేష్ పని నిమిత్తం బైక్‌పై కసుమూరుకు వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళుతుండగా కసుమూరు మలుపు రోడ్డు వద్ద బైక్‌ను వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌ను నడుపుతున్న వెంకటేష్‌కు గాయాలు కాగా స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. క్షతగాత్రుడిని చికిత్సనిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

వైభవంగా రథసప్తమి వేడుకలు


చెన్నకేశవస్వామికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ముత్తుకూరు: రథసప్తమి వేడుకలను శనివారం మండలంలోని పలు గ్రామాల్లో వైభవంగా నిర్వహించారు. ముత్తుకూరు, ఈపూరు గ్రామాల్లోని చెన్నకేశవస్వామి ఆలయాల్లో స్వామివారి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈపూరులో చెన్నకేశవస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాల నడుమ గ్రామంలో స్వామివారికి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

ఉత్తమ అధ్యాపకుడికి అభినందన


వెంకటప్రసాద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): విడవలూరులోని పీఆర్‌ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎ.వెంకటప్రసాద్‌ను శనివారం కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత మాట్లాడుతూ తమ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న వెంకటప్రసాద్ జిల్లాస్థాయిలో ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ మేరకు ఈ నెల 26వ తేదీన నెల్లూరులో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ చక్రధర్‌బాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారని తెలిపారు.

మాదక ద్రవ్యాలకు అలవాటు పడొద్దు



మాట్లాడుతున్న ఎస్‌ఈబీ సీఐ బాలకృష్ణ

ముత్తుకూరు: మాదక ద్రవ్యాలకు అలవాటు పడి యువత చెడు మార్గంలో పయనించవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బాలకృష్ణ సూచించారు. మండలంలోని బ్రహ్మదేవిలో ఓ ప్రైవేట్ కళాశాలలో విద్యార్థులకు శనివారం నిర్వహించి అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. చెడు స్నేహాల కారణంగా యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి, ప్రాణాలు పోగొట్టుకొంటున్నారని ఆందోళన వెలిబుచ్చారు. నైతిక విలువలు పాటిస్తూ విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించాలన్నారు. తల్లిదండ్రులకు కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి..

పొదలకూరు: మండలంలోని వనంతోపు సెంటర్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆల్తుర్తి గ్రామానికి చెందిన యువకుడు గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు ఆల్తుర్తి నుంచి అంకయ్య బైక్‌పై పొదలకూరుకు వస్తుండగా ముందు వెళుతున్న కారును ఓవర్ టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి తూమును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అంకయ్య గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్సనిమిత్తం 108 వాహనంలో పొదలకూరుకు సీహెచ్‌సీకి తరలించారు. ఎస్సై కరిముల్లా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రపర్వంగా రథయాత్ర



నెల్లూరు(బృందావనం): నగరంలో గౌర – నితాయ్ రథయాత్రను నేత్రపర్వంగా శనివారం నిర్వహించారు. సంతపేటలోని నాలుగు కాళ్ల మండపం వద్ద రథయాత్రను కమిషనర్ హరిత ప్రారంభించారు. విశేషాలంకారంలో కొలువైన గౌర – నితాయ్‌కు ఇస్కాన్ నెల్లూరు శాఖ అధ్యక్షుడు సుఖదేవస్వామి హారతులిచ్చారు. మినీబైపాస్ రోడ్డులోని పీవీఆర్ కల్యాణ మండపానికి రథయాత్ర రాత్రి చేరింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ఇస్కాన్ మందిర స్వాములు భగవత్ సందేశాన్నిచ్చారు. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన వేదికపై గౌర – నితాయ్‌కు చప్పన్‌భోగ్ నివేదన, హారతి కీర్తన, దీపహారతులను సమర్పించారు. అనంతరం రథయాత్రలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ న్యూఢిల్లీ సలహామండలి చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు తోడ్పాటును అందించారు.